# హరోం హరోం

**శ్రీశ్రీ**

ఆంధ్రదేశంలో గొప్పవాడు కావడానికి ఒక చిన్న ఉపాయం ఉంది. అది ఎవరూ అమలులో పెడతారనే నమ్మకం లేదుగాని అయినా బైటపెట్టక తప్పదు. ఒక అమూల్యమైన సత్యాన్ని కనిపెట్టినప్పుడు దాన్ని అందరి అందుబాటులోకీ తీసుకురావాలనే తత్వం నాది.

కాబట్టి చెబుతున్నా. ఆంధ్రదేశంలో నువ్వు గొప్పవాడివి కాదలచుకుంటే ఒక్కటే మార్గం, చచ్చిపో.

నమ్ము నామాట. చచ్చిపోయి చూడు. అప్పుడు నీకు అఖండ గౌరవం జరిగి తీరుతుంది. అదంతా నీకు కనబడదు — నిజమే. కాని ఏ మృత్యువుకీ లొంగని నీ ఆత్మ ఒకటి ఏడిసింది కదూ? అది కనిబెడుతూనే ఉంటుంది నీకు జరిగే మర్యాదలన్నింటినీ.

నీ మరణాన్ని పురస్కరించుకొని టౌనుహాలులో జరిగే సానుభూతి సభలో నీ ఆత్మ చూరునుంచి వేళ్లాడుతూ వినబడని కరతాళధ్వనులు చేస్తుంది. నువ్వు బతికి ఉన్నప్పుడు చాటుగా నిన్ను తిట్టిపోసిన మిత్రులే నీ సుగుణపరంపరలను జాబితా వేస్తూవుంటే నీ ఆత్మకు కలిగే ఆనందాన్ని స్మరించుకొని అయినా వెంటనే చచ్చిపో నాయనా వెంటనే చచ్చిపో.

ఇంకో సంగతి. నువ్వు ఆంధ్రదేశంనుంచి వీలయినంత హెచ్చు గొప్పతనం పిండుకోవాలంటే సాధ్యమైనంత దూరంగా పారిపోయి జీవించవలిసిందని నా సలహా. ఎంత దూరం పోతే అంత పొడుగ్గా సాగుతుంది నీ పేరు. ఈలోపున ఆంధ్రదేశం అవ్యాహతంగా విదేశీయ వీరారాధన సాగిస్తుంది. ముఖ్యంగా వంగీయుల కళానైపుణ్యానికీ, తమిళమణుల శేముషీ విశేషానికీ ఆంధ్రదేశం అంతా హారతి పట్టుతూ ఉంటుంది.

ఇంతట్లో నువ్వు చచ్చిపోయావన్న కబురు తెలుస్తుంది. ఆరోజు ఆంధ్రులకు పర్వదినం. ప్రతీ పట్టణంలోనూ, పల్లెటూరులోనూ అవాఙ్మానసగోచరమైన మహోత్సాహం వెల్లివిరుస్తుంది. నిన్ను ఎరగని వాళ్లంటూ ఉండరు. "ఆయన మా ఇంటిపక్కనే ఉండేవాడు." "మేమిద్దరమూ కాలినడకను పదిమైళ్లు ప్రయాణం చేస్తిమి." "మా పిల్లలందరికి ఆయన చాకలేట్లు పంచిపెట్టేవాడు." ఇత్యాదయః.

తెలుగు పత్రికలన్నీ నీమీద సంపాదకీయాలు వ్రాస్తాయి. వాటిని వ్యాసపిండాలని 'ఆరుద్ర' లాంటి పెంకిపురుగు అంటేనేం గాక? తెలుగు పత్రికలలో సంపాదకీయాలకి నీ అకాలమరణం (నువ్వెప్పుడు చచ్చిపోయినా అకాల మరణమే. సకాలంలో ఎవ్వరూ మరణించరనేది అందరికీ తెలిసిన రహస్యం.) కారణం కావడంకంటె నువ్వు కోరుకోదగ్గదేముంటుంది? ప్రతీ పత్రికా నీ ఆత్మకి శాంతి లభించాలని పరమేశ్వరుణ్ణి కోరుతుంది. అది నీ ఆముష్మిక యాత్రకి ఎంత తోడ్పడుతుందో వేరే చెప్పాలా?

బతికిఉన్న వాళ్ళ లోపాలను ఎంత శ్రద్ధగా, స్తనశల్య పరీక్షగా ఎంచగలరో చచ్చిపోయినవాళ్ళ సద్గుణాలనుకూడా అంత నిర్దుష్టంగా, నిష్కామకర్మగా బేరీజు వెయ్యగలిగినవారు ఒక్క ఆంధ్రులే అని మరిచిపోకు.

నీ 'విలువ'కు తగ్గ మూల్యం ఒక్క ఆంధ్రదేశంలోనే లభించగలదని ఘంటాపథంగా చెప్పగలను. కాని దీనికి ఒకటే షరతు ఉంది. చచ్చిపోవాలి.

## ఆనందవాణి

★

రచయితలు చాలామంది తాము పంపించిన రచనలు ప్రకటింపబడతాయో లేదో తెలియక చాలా తహతహపడుతూ వుంటారు.

మీ రచనలతోబాటు పోస్టుబిళ్ళలు కూడా పంపిస్తే సాధ్యమైనంతత్వరలో, ప్రకటించేదీ లేనిదీ తెలియబరుస్తూ, ప్రకటించడానికి వీలులేనియెడల సదరు రచనలు త్రిప్పి పంపబడును.

ఆనందవాణికి ఏజంట్లు, చందాదార్లు మొదలయినవారు పంపించే మనియార్డరు వ్యక్తుల పేర గాకుండా "మేనేజరు, ఆనందవాణి, నెం. 12, తంబుచెట్టి వీధి, మద్రాసు" అని వ్రాసి పంపవలెను.